క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం బిల్లులు ఇవ్వండి

మెదక్ కలెక్టరేట్: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు, వేతనాలు వెంటనే విడుదల చేయాలని కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్మిక నాయకులు మాట్లాడుతూ.. 4 నెలలుగా బిల్లులు, వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ దసరా పండుగలు కూడా నిర్వహించుకోలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. కుటుంబ నిర్వహణ కూడా చాలా కష్టంగా ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ, యాదమ్మ, బేగం, సత్యమ్మ, నాగరాజు, పాల్గొన్నారు.

విశ్వకర్మ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా జనార్దన్

టేక్మాల్(మెదక్): అఖిల భారత విశ్వకర్మ మహాసభ మెదక్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఎల్లుపేటకు చెందిన జనార్దన్‌చారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సోమవారం తన ఎన్నికకు రాష్ట్ర అధ్యక్షుడు జగన్నాథ చారి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘ బాధ్యతలు చేపడుతూ జాతి కోసం నిరంతరం కష్టపడతానని, విశ్వకర్మల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. విశ్వకర్మలు అందరూ ఏకమై జాతి అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని కోరారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు జగన్నాథ చారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగాచారి, రాష్ట్ర కోశాధికారి మురళి, గౌరవ అధ్యక్షుడు చెన్నయ్య, అధికార ప్రతినిధి సతీష్ చారి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసచారి, లీగల్ అడ్వైజర్ డా. పగిడోజు భాస్కరచారిలతో పాటూ రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భగీరథ తాగునీటిలో చేప



రేగోడ్(మెదక్): మిషన్ భగీరథ తాగు నీటిలో చేప వచ్చిన సంఘటన మండలంలోని పోచారం గ్రామంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన టీ హోటల్ వద్ద ఉదయం నీళ్లు పట్టే సమయంలో నల్లా నీటిలో చేప పిల్ల వచ్చిందని తెలిపారు. స్వచ్ఛమైన నీటితోనే ఆరోగ్యమని ప్రభుత్వం, వైద్యులు చెప్తున్నా.. నల్లా నీళ్లలో చేప పిల్ల రావడం చూసి అవక్కయ్యారు. చేప పిల్ల వచ్చిన నీళ్లను వాడుకోవడానికి పట్టుకున్నామని తెలిపారు. పై విషయమై మిషన్ భగీరథ ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా, తాగునీటి సరఫరాలో చేప వచ్చే అవకాశమే లేదని పేర్కొన్నారు.

తాగునీటి నిర్వహణపై వర్క్‌షాప్

కొల్చారం(నర్సాపూర్): తాగునీటి నిర్వహణపై పంపుమెన్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ సూచించారు. సోమవారం మండలంలోని మొత్తం శెట్టిపల్లి రైతు వేదికలో కొల్చారం, చిలప్‌చెడ్ ఎంపీడీఓ కృష్ణవేణి, ఆనంద్ అధ్యక్షతన పంపుమెన్లకు గ్రామ మంచి నీటి సహాయకుడు అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ.. పంపుమెన్లు గ్రామాల్లో నీటి పైప్‌లైన్ల మరమ్మతులు, నీటి స్వచ్ఛత, నీటి మోటార్ల రిపేర్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని సూచించారు. తాగునీటి సమస్య రాకుండా చూడడమే ప్రధాన కర్తవ్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం మంచినీటి సరఫరాపై రూపొందించిన గ్రామ మంచినీటి సహాయకుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు.

తపస్ నూతన కార్యవర్గం

చిన్నశంకరంపేట(మెదక్): తపస్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీహరి(యూపీఎస్, మాందాపూర్), బక్కోళ్ల మహేశ్(పీఎస్, సంగాయిపల్లి) ఎన్నికయ్యారు. కోశాధికారిగా నరేందర్, ఉపాధ్యక్షులుగా భాస్కర్‌రావు, ఎం.లక్ష్మి, కిషన్, కార్యదర్శులుగా నవిత, ఎస్.మ్గారాణి, ప్రమోద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ తెలిపారు.

కాలుష్య కాసారాలతో కకావికలం

నిబంధనలకు విరుద్ధంగా రసాయన వ్యర్థాలను వదులుతున్న పరిశ్రమలు

- జల, వాయు కాలుష్యంతో పాడైపోతున్న పంటలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు
- తూతూ మంత్రంగా పీసీబీ తనిఖీలు



ఓ పరిశ్రమ నుంచి బయటకు వస్తున్న వాయు కాలుష్యం



నవాబుపేటలో వ్యర్థ రసాయనాలతో కుంటను తలపిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా రసాయన పరిశ్రమలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో జల, వాయు కాలుష్యంతో పంటలు పాడైపోతున్నాయి. మండలంలోని నవాబుపేట గ్రామ శివారులోని పలు రసాయన పరిశ్రమలు నిబంధనలు అతిక్రమిస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. పరిశ్రమల్లోని వ్యర్థ రసాయనాలను ట్యాంకర్ల ద్వారా డంపింగ్ కేంద్రానికి తరలించాల్సి ఉండగా, అలా కాకుండా బహిరంగంగా కాల్వల ద్వారా బయటకు వదిలేస్తున్నారు. డంపింగ్ కేంద్రాలకు వ్యర్థాలను తరలిస్తే భారీగా ఖర్చు అవుతుందనే ఉద్దేశ్యంతో పరిశ్రమ ఆవరణ నుంచే బయటకు వదిలేస్తున్నారు. వ్యర్థాలు పారిన ప్రదేశంలో పచ్చని గడ్డి సైతం మాడి మసవడంతో పాటు భూగర్భజలాలు సైతం కలుషితమవుతున్నాయి. ముఖ్యంగా వర్షకాలాన్ని ఆసరాగా తీసుకొని వ్యర్థాలు బయటకు వదులుతుండడం వల్ల గ్రామ చెరువులోకి చేరుతున్నాయి. వ్యర్థాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలుమార్లు రైతులు పరిశ్రమ యాజమాన్యానికి చెప్పినా.. పట్టించుకోకపోవడంతో ఆందోళన చేసిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. గ్రామ పరిధిలో ఉన్న పలు కెమికల్ పరిశ్రమలు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు సమాచారం. పరిశ్రమలకు సంబంధించి బోర్డులు సైతం లేకపోవడంతో వాటి అనుమతులపై సందేహం ఉంది.

కలుషితమైన బోరుబావుల నీరు

రసాయన జలాలతో బోరుబావులు, చెరువు నీరు కలుషితం అవుతోంది. పలు పరిశ్రమలకు సంబంధించి ఎలాంటి బోర్డులు లేకుండా నిర్వహిస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

– రవిగౌడ్, రైతు, నవాబుపేట

ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం



నవాబుపేటలోని కెమికల్ పరిశ్రమలు వదులుతున్న వ్యర్థ రసాయనాలతో పంటలు పాడైపోతున్న విషయం పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాం. ఇక్కడికి వచ్చిన అధికారులు వ్యర్థ రసాయనాల శాంపిల్స్ సేకరించి చేతులు దులుపుకున్నారు. సంబంధిత పరిశ్రమలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులకు అవస్థలు పడుతున్నారు.

– ఇంద్రసేనరెడ్డి, రైతు, అనంతారం

చర్యలు తీసుకుంటాం



నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను బహిరంగంగా వదులుతున్న పరిశ్రమలపై ఫిర్యాదు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. రైతుల ఫిర్యాదు మేరకు నవాబుపేట గ్రామ పరిధిలో వస్తున్న కెమికల్ వ్యర్థాల నమూనాలు సేకరించి, ల్యాబ్‌కు పంపించాం. గతంలో ఫిర్యాదులు అందాయని సంబంధిత పరిశ్రమలకు నోటీసులు జారీచేశాం.

– కుమార్‌పాటీ, పీసీబీ ఈఈ

చేతులు మారుతున్న పట్టా భూములు

నర్సాపూర్: తమ గ్రామంలో లావణి పట్టా భూములు చేతులు మారుతున్నాయని మండలంలోని కాగజ్‌మద్దూర్ గ్రామానికి చెందిన నర్సింలు సోమవారం ఆర్‌డీఓకు ఇచ్చిన వినతిపత్రంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ గ్రామానికి చెందిన 176 సర్వే నంబర్‌లో లావణిపట్టా భూమి ఉందని దానిలో ప్రభుత్వం పేదలకు అసైన్‌మెంట్ ద్వారా భూమిని పంపిణీ చేసిందని చెప్పారు. కాగా కొందరు రియల్ వ్యాపారులు లావణి భూములు కొనుగోలు చేసి, పక్కన ఉన్న భూములు ఆక్రమించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా 2017 వరకు రెవెన్యూ రికార్డుల్లో తమ గ్రామంలోని 176 సర్వే నంబర్ లావణి పట్టా పేరుతో నమోదు అయిందన్నారు. 2017–18 సంవత్సంలో రెవెన్యూ అధికారులు సదరు భూమిని పట్టా భూమిగా నమోదు చేశారని ఆరోపించారు. లావణి పట్టా భూమిని, పట్టా భూమిగా ఎలా నమోదు చేస్తారని ప్రశ్నిస్తూ 176 సర్వే నంబరు భూమిపై విచారణ చేసి, లావణి పట్టా భూములను కాపాడాలని ఆర్‌డీఓను కోరారు. ఈ విషయమై ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి స్పందిస్తూ.. మండల తహసీల్దార్ ద్వారా విచారణ చేయించి, లావణి భూములను కాపాడేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్ ప్రారంభించారు. మెదక్, నిజాంబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ పట్టభద్రుల నియోజకవర్గానికి ఓటరుగా నమోదు చేసుకునే పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని పట్టభద్రులు తమ ఓటు హక్కు నమోదు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ గ్రేస్ బాయి సోమవారం సూచించారు. త్వరలో జరగనున్న పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా ఓటు హక్కు నమోదు అవకాశాన్ని పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

తూప్రాన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ అధ్యక్షతన దసరా పండుగ సందర్భంగా కార్మికులకు దుస్తులు అందజేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): అనారోగ్యం బారిన పడి ప్రైవేట్ ఆస్పత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు చేయించుకున్న పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంలాంటిదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రం వెల్దుర్తిలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన అనంతరం మండలంలోని కుకునూర్, హస్తాల్‌పూర్ గ్రామాల్లోని ఇరువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేయాలని, ఆయా గ్రామాల నాయకులకు అందజేశారు. ఈ



వెల్దుర్తి(తూప్రాన్): చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, పాండురంగం, అశోక్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్: ఎల్‌ఓసీ అందిస్తున్న రాజిరెడ్డి

నర్సాపూర్‌లో..

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం హత్నూర మండలంలోని బోర్పట్ల గ్రామానికి చెందిన నాగరాణికి రూ.రెండు లక్షల ఎల్‌ఓసీ లెటర్‌ను ఆయన అందజేశారు. అనంతరం నర్సాపూర్ మండలంలోని తిరుమలపూర్ గ్రామానికి చెందిన సువర్ణకు రూ.ఒకలక్ష 25వేల ఎల్‌ఓసీని అందజేశారు.

ధర్మ రక్షణతోనే ప్రపంచశాంతి సాధ్యం

చేగుంట(తూప్రాన్): ధర్మ రక్షణతోనే ప్రపంచశాంతి సాధ్యమవుతుందని ఆర్‌ఎస్‌ఎస్ మెదక్ విభాగ్ సహ కార్యవాహ నర్సింలు అన్నారు. మండల కేంద్రం చేగుంటలో సోమవారం ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పదసంచలన్ ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న నర్సింలు మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాలను ధర్మాన్ని కాపాడుకోవడం కోసం డాక్టర్‌జీ ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించినట్లు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నో శాఖలుగా విస్తరించి, దేశవిదేశాల్లో సేవలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల కేరళ వరదల్లో ప్రజలను కాపాడే ప్రయత్నంలో ఇద్దరు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారన్నారు. సమాజాన్ని కాపాడుకునే ఆలోచనతో పని చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కోసం సమాజం కొంత సమయం కేటాయించి క్రమశిక్షణ నేర్చుకోవాలని కోరారు.కార్యక్రమంలో రఘురాం శర్మ, చుంచు యాదగిరి, వెంకటేశ్ చేగుంట, చిన్నశంకరంపేట, నార్సింగి, రామాయంపేటకు చెందిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సింలు



శివ్వంపేట(నర్సాపూర్): కొంతన్‌పల్లిలో కొలువైన దుర్గమాత



కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో లలితాపరమేశ్వరీగా అమ్మవారు



చిన్నశంకరంపేట(మెదక్): కొర్విపల్లిలో చండీమాతగా మహాగౌరీ



కొల్చారంలో మహాచండీదేవి అవతారంలో అమ్మవారు

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు



వెంకట్రావ్‌పేటగేట్ వద్ద ఆటోలకు సీఐటీయూ స్టిక్కర్లు వేస్తున్న నాగరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని వెంకట్రావ్‌పేటగేట్ వద్ద ఆటో డ్రైవర్లకు సీఐటీయూ యూనియన్ స్టిక్కర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్ ప్రయాణంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు జీవనభృతి ఇవ్వాలన్నారు. ఆటో డ్రైవర్లకు సబ్సిడీపై ఆటోలు పంపిణీ చేయాలని తెలిపారు. ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు అశోక్, ఇతర డ్రైవర్లు పాల్గొన్నారు.

పార్వతీమాత నమోనమో..

జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో మండపాల్లో ప్రతిష్ఠించిన దుర్గమ్మలకు భక్తులు పూజలు, కుంకుమార్చన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సోమవారం ఐదవ రోజు ఆలయాల్లో అమ్మవారు లలితాపరమేశ్వరీదేవి అవతారంలో అలంకరించారు.



పెద్దశంకరంపేట(మెదక్): గడికోటలో అమ్మవారి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



చిలప్‌చెడ్(నర్సాపూర్): అజ్జమర్రిలో..

అశోక్ గౌడ్ సేవలు అభినందనీయం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్ రూరల్: రెడ్డిపల్లి మాజీ ఉపసర్పంచ్ అశోక్ గౌడ్ సేవలు అభినందనీయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. సోమవారం అశోక్‌గౌడ్ సొంత డబ్బులతో గ్రామ పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగ కానుకగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ.. అశోక్ గౌడ్ ఉప సర్పంచ్ పదవికి కాలం ముగిసినప్పటికీ గ్రామంలో అనేక సేవలు చేస్తున్నాడని అన్నారు. పదవులతో సంబంధం లేకుండా నాయకులు ప్రజలకు ఏదో రకంగా సేవ చేయాలని అన్నారు.



రెడ్డిపల్లిలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఆంజనేయులు గౌడ్



అల్లాదుర్గం: గడిపెద్దాపూర్‌లో భక్తులు



టేక్మాల్(మెదక్): బొడ్మట్‌పల్లిలో కుంకుమార్చన



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో..



రేగోడ్‌లో..



చిలప్‌చెడ్(నర్సాపూర్): జగ్గంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మెదక్‌జోన్: కోర్టులో బతుకమ్మ సంబరాల్లో జిల్లా జడ్జి లక్ష్మీశారద



చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

శ్రీలక్ష్మి నీ మహిమలు..

బతుకమ్మ సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం జిల్లా వ్యాప్తంగా బతుకమ్మను భక్తిశ్రద్ధలతో మహిళలు కొలిచారు. చిలప్‌చెడ్ మండలంలోని ఆయా గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేదుకలను ఉయ్యాల పాటలు పాడుతూ.. ఆడారు.



కౌడిపల్లిలో..



టేక్మాల్: పల్వంచలో ..



పెద్దశంకరంపేట తహసీల్దార్ కార్యాలయంలో ..



శివ్వంపేటలో ..

సంక్షిప్త వార్తలు

◆ మెడికల్ షాపుల కార్యవర్గం ఎన్నిక

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ శివారులోని చాముండేశ్వరీ ఆలయ ఆవరణలో సోమవారం మండలంలోని మెడికల్ షాపులు, కెమిస్ట్‌లు, ఫార్మాసిస్టులు కలసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్. రెడ్యానాయక్, ప్రధాన కార్యదర్శిగా కే.సత్యనారాయణ, కోశాధికారిగా గణేశ్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు.

◆ చలో కలెక్టరేట్ జయప్రదం చేయండి

వెల్దుర్తి(తూప్రాన్): ఎస్సీ వర్గీకరణలో రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరికి నిరసనగా బుధవారం తలపెట్టిన హలో మాదిగ.. చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు యాదగిరి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించి, వర్గీకరణ అమలు దేశంలోనే మొదటగా తెలంగాణలో చేపడతామని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి తన హామీని అమలుచేయకపోవడం విచారకరమన్నారు. కేవలం మాలల మాటకే ప్రాధాన్యతనిస్తూ మాదిగలకు సీఎం నమ్మకద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో వర్గీకరణ అమలుచేసే వరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాలు ఆందోళనలు కొనసాగిస్తామని అన్నారు.